సాక్షి ప్రకాశం

బుధవారం | 27 | సెప్టెంబర్ | 2023



సరిహద్దులో పటిష్ట నిఘా

ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమ రవాణా నిరోధించేందుకు సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. - 8లో..



కుటుంబ కలహాలతో ఆత్మహత్య

కుటుంబ కలహాలతో వివాహిత వాస్మాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అర్ధవీడు మండలం మాగుటూరులో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దారవీడు ఎస్ఐగా రాజ్‌కుమార్

ఒంగోలు టౌన్: పెద్దారవీడు ఎస్సైగా టి.రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ఎస్పీ మలికాగర్గ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాజ్‌కుమార్ ఒంగోలు సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తూ తాలుకా ఎస్ఐగా అటాచ్‌లో ఉన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



త్రిపురాంతకంలో ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

త్రిపురాంతకం: ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. త్రిపురాంతకంలోని శ్రీబాలా త్రిపురసుందరీ దేవి ఏజన్సీస్ తనిఖీ చేసి రూ.1.28 లక్షల విలువైన విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేశారు. కిసాన్ అగ్రిమాల్ తనిఖీ చేసి రూ.2.51 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలను విజిలెన్స్ ఏఓలు సంగమేశ్వరరెడ్డి, కే వెంకటరెడ్డి, కే నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ అండర్–19 జట్ల ఎంపిక

ఒంగోలు సెంట్రల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)లో అండర్–19లో విద్యార్థులకు పలు పోటీల్లో ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ సైమన్ విక్టర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆదినారాయణ తెలిపారు. ఒంగోలు ఏబీఎం జూనియర్ కాలేజి గ్రౌండ్‌లో బుధవారం ఉదయం పది గంటలకు జిమ్నాస్టిక్స్, యోగా సెలక్షన్ నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఫుట్‌బాల్ ఆటలో ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి జెరాక్స్ మార్క్స్‌లిస్ట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో ఫిజికల్ డైరెక్టర్ కే డేవిడ్ రాజుకు విద్యార్థులు వివరాలు సమర్పించాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆదినారాయణ వివరించారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9949722791ను సంప్రదించాలని కోరారు.

వైద్యశాలను పరిశీలించిన జాయింట్ కమిషనర్



మాతాశిశు వైద్యశాలను పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్ సరళమ్మ

ఒంగోలు అర్బన్: మాతాశిశు వైద్యశాలను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సరళమ్మ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రిలోని లేబర్ వార్డు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆపరేషన్ థియేటర్, మ్యాటీ వార్డు, ఇతర వార్డులతో పాటు కొత్తగా నిర్మిస్తున్న అదనపు బ్లాక్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బధిరుల దినోత్సవం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: స్పందన భవనంలో మంగళవారం బధిరుల, సంకేత దినోత్సవ వేడుకలు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనికి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో జేసీ మాట్లాడుతూ బధిరుల ప్రాముఖ్యతను గుర్తించి వారికి అవసరమైన విద్య, సంరక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుని కమ్యూనికేషన్ సాధనంగా సాంకేతికతపై పూర్తి తర్ఫీదునివ్వాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన మాట్లాడుతూ బధిరుల సంఘ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రజలతో మమేకం చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తున్నామన్నారు. గడిచిన నాలుగేళ్లలో వారి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. బధిరులు పూర్తి స్వతంత్ర్యంతో జీవించేలా ప్రోత్సహిస్తూ, వారి హక్కులు బధిరుల పాఠశాల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. దీనిలో బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ టీ వెంకటేశ్వర్లు, బధిరుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సురక్ష

ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల్లోని ప్రజల చెంతకే వైద్యసేవలను చేరువ చేస్తోంది. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటింటి సర్వే..ప్రత్యేక హెల్త్ క్యాంపులకు శ్రీకారం చుట్టింది. వైద్యం అవసరమైన వారికి నిపుణులైన వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు చేయడంతో పాటు మందులు అందించనున్నారు. జిల్లాలో 15 నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వే దాదాపు పూర్తికావచ్చింది. ప్రజల ఆరోగ్య నివేదికలు సిద్ధంగా ఉన్నాయి. 30వ తేదీ నుంచి ప్రత్యేక హెల్త్ క్యాంపులతో స్పెషలిస్టు వైద్యులతో మెరుగైన వైద్యసేవలు అందించనున్నారు.

- ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వే
- 30వ తేదీ నుంచి ప్రత్యేక హెల్త్ క్యాంపులు
- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు చేరువగా వైద్య సేవలు
- క్యాంపుల్లో ఎంబీబీఎస్ డాక్టర్లతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు
- ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేత



పైలెట్ ప్రాజెక్ట్ కింద మోడల్ హెల్త్ క్యాంపులో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఒంగోలు అర్బన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ చేసి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న వైద్యులు, పారామెడికల్, ఇతర ఉద్యోగాలను భర్తీ చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు–నేడు కార్యక్రమం ద్వారా అత్యాధునికంగా మార్పు చేశారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వైద్య సేవలు తీసుకుపోయారు. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో మరో కొత్త అధ్యాయానికి తెరతీశారు. దీని ద్వారా ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందనున్నాయి. దీంతో ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు.

ప్రతి కుటుంబ ఆరోగ్య అవసరాలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 15 నుంచి ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి గృహస్తుల ఆరోగ్య అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆయా ఇళ్లకు వెళ్లి ఆరోగ్య సమస్యలపై సమగ్రమైన సమాచారం సేకరించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. రోగులకు చికిత్స ఆవశ్యకత ఉంటే వెంటనే నియోజకవర్గ, జిల్లా స్థాయి ఆస్పత్రులకు రిఫర్ చేశారు. విలేజ్‌హెల్త్ క్లినిక్‌ల పరిధిలో తప్పనిసరిగా మందులు సిద్ధం చేసుకుని అవసరమైన మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక హెల్త్ క్యాంపులు:
జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి మండలాల వారీగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. హెల్త్ క్యాంపులు ప్రారంభించే ముందుగానే ప్రజల ఆరోగ్య నివేదికలు సిద్ధంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు. రోగి పేరు నమోదు చేయగానే మొత్తం సమాచారం తెలిసిపోతుంది. ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు అందుబాటులో ఉంటారు. విలేజ్‌హెల్త్ క్లినిక్‌ల పరిధిలో గుర్తించిన రోగులందరికీ క్యాంపు నిర్వహించిన రోజు వైద్య సేవలు అందిస్తారు. ప్రజలకు అనువైన ప్రాంతాల్లో ఈ శిబిరం ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయాధికారి, సమన్వయ కమిటీలో గ్రామ, వార్డు సచివాలయాలు, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ బాధ్యత వహిస్తారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో, పీహెచ్‌సీ వైద్యులు, సీడీపీవోలు, ఎంఈఓలకు కార్యక్రమం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. వైద్య శిబిరం నిర్వహించే వైద్య శిబిరాలకు మౌలిక సదుపాయాలు ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అన్నీ గ్రామాల్లో శిబిరాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ:
వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ముఖ్యంగా మధుమేహం, క్యాన్సర్, గుండె, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి, గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తారు. బాలింతలు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. వైద్య శిబిరాలకు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి కూడా స్పెషలిస్టు వైద్యులు సేవలందించేలా చర్యలు తీసుకుంటారు.

వైద్య సేవలు, మందులు ఉచితం
వైద్య పరీక్షల అనంతరం రోగులకు పంపిణీ చేసేందుకు అన్నీ రకాల మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు ప్రారంభించారు. అధునాతన వైద్య పరికరాలతో వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు, వైద్య సేవలు, మందులు అన్నీ ఉచితంగానే ప్రజలకు అందజేస్తారు.

పక్కాగా నిర్వహించేలా చర్యలు



ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేసేలా హెల్త్ క్యాంపులు పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. పైలెట్ ప్రాజెక్టులా మోడల్ హెల్త్ క్యాంపులు నిర్వహించి ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించే హెల్త్ క్యాంపుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకున్నాం. విధులు కేటాయించిన అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా ఆదేశాలు జారీ చేశాం. ఇంటింటి సర్వేలో తీసుకున్న ఆరోగ్య వివరాలను సంబంధిత యాప్‌లో నమోదుచేసి హెల్త్ క్యాంపుల్లో అవసరమైన వైద్య సేవలు, మందులు అందిస్తారు.

– ఏఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్

ప్రజలకు ఎంతగానో ఉపయోగం



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇంటి వద్దకు వైద్య సేవలు అందించడం గర్వించదగిన విషయం. వైద్య ఆరోగ్య శాఖ పరంగా వైద్యుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు అందరికీ తగిన సూచనలు, ఆదేశాలు ఇస్తున్నాం. జిల్లాలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే కాకుండా ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తాం.

– రాజ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

సంపూర్ణ ఆరోగ్యానికి నాంది పలకాలి

- ప్రతి ఇంటినీ జల్లెడపట్టండి
- ఎంత మందికి నాణ్యమైన వైద్యం అందించామన్నదే లక్ష్యం
- కలెక్టర్ దినేష్ కుమార్
- ఈతముక్కలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ ప్రారంభం



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఈతముక్కల (కొత్తపట్నం): గ్రామీణ ప్రాంత ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక అడుగు ముందుకేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. జిల్లాలో ఈతముక్కల గ్రామ సచివాలయం–2ను మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారని చెప్పారు. ఈతముక్కల ఎంపీపీ స్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధ్యక్షత వహించారు. మెడికల్ క్యాంప్‌ను కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా టోకన్ కౌంటర్, రిజిస్ట్రేషన్ కౌంటర్, స్పెషల్ డాక్టర్, మెడికల్ కౌంటర్, ఐసీడీసీ స్టాల్‌ను ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కలెక్టర్ పరిశీలనలో జగనన్న ఆరోగ్య సురక్ష టోకన్లలో సీరియల్ నంబర్లు వేయాలని, యాప్‌లో కూడా నమోదు చేయాలన్నారు. ఒక వేళ యాప్ ఓపెన్ కాకపోతే ఆఫ్‌లైన్‌లో చేయాలని సూచించారు. స్పెషల్ డాక్టర్లతో పరీక్షల విధానంపై మాట్లాడారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు.

ఎంత మందికి నాణ్యమైన వైద్యం అందించామన్నదే ముఖ్యం:
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీల పరిధిలో హెల్త్ క్లినిక్ సెంటర్ల ఏర్పాటు, 15 రోజులకు ఒక సారి ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పరీక్షలు చేయటం, ఇంకా మెరుగైన వైద్యం అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టారన్నారు. ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌వో) ఇంటిలో ఉన్న ప్రతి వ్యక్తినీ పరీక్షించి వారికి ఎటువంటి వ్యాధి ఉందో గుర్తించి, జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో అప్‌లోడ్ చేసి తరువాత టోకన్ ఇస్తారన్నారు. మెడికల్ క్యాంప్‌లో స్పెషల్ డాక్టర్ల పరీక్షల అనంతరం ఇంకా సర్జరీలు ఉంటే జిల్లా వైద్యశాలకు, ఆరోగ్య శ్రీ వర్తించేలా మెడికల్ సిబ్బంది చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఒక రోగిని ఇంటి దగ్గర నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లకు వలంటీర్లు చెయ్యిపట్టుకుని తీసుకొచ్చి మళ్లీ వారి ఇంటి దగ్గరకు వదిలిపెట్టేలా సేవలు అందించాలని వలంటీర్లను ఆదేశించారు. రోగికి ఏ వ్యాధి ఉంది, ఏ మందులు వేసుకోవాలని ఏఎన్ఎం, వలంటీర్లు తెలియచెప్పాలన్నారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టారని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. వారం రోజుల నుంచి ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌వో)లు, మెడికల్ సిబ్బంది సర్వేను పూర్తి చేశారన్నారు. ఇప్పటికే 104, 108, 15 రోజుల ఒక సారి ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఇంకా మెరుగైన వైద్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ పెట్టామన్నారు. 20 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ప్రోగ్రాం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సరళ, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా వైద్యాధికారి రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మాధవీలత, సర్పంచ్ మేడికొండ సునీత, డాక్టర్ వాణిశ్రీ,, జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి, తహసీల్దార్ బి.రమణారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, స్పెషలిస్టు డాక్టర్లు అంద్రాష్, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డీటీసీవో డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ శివపార్వతి, డాక్టర్ వెంకటేష్, బండారు వెంకట సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్ కుమార్, నితిన్, బిల్లా చెన్నయ్య, వలంటీర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ప్రథమ కర్తవ్యం

- నెల్లూరు జోన్ ఈడీ షేక్ ఆదం సాహెబ్



డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న నెల్లూరు జోన్ ఈడీ షేక్ ఆదం సాహెబ్

ఒంగోలు: ఆర్టీసీ ప్రథమ నినాదం ప్రయాణికుల భద్రత అని, ప్రమాద రహితంగా బస్సులు నడపడం ఆర్టీసీ డ్రైవర్ల ప్రథమ కర్తవ్యమని నెల్లూరు జోన్ ఈడీ షేక్ ఆదం సాహెబ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఒంగోలు డిపో ట్రైనింగ్ కాలేజీలో రోడ్డు భద్రత, ఇంధన పొదుపు అనే అంశంపై ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బస్సులు నడిపేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. రద్దీ ప్రదేశాల్లో బస్సులు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అంతే కాకుండా ఇంధన పొదుపు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్టీసీలో ప్రతి డిపో రోజుకు వేలలీటర్ల డీజిల్ వినియోగిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రతి డ్రైవర్ రోజుకు ఒక చుక్క మిగిల్చినా ఆర్టీసీకి ఏడాదిలో అత్యంత అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం ప్రయాణికులకు అత్యంత ఉత్తమ సేవలు అందించాలనే తపనతో ఉందని, ఆ లక్ష్యం దిశగా ప్రతి డ్రైవర్ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సమావేశంలో ఆర్ఎం బి.సుధాకర్, నెల్లూరు డీసీఎంఈ శ్రీనివాసరెడ్డి, వివిధ డిపోల నుంచి మేనేజర్లు, అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతులు అక్టోబర్ 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ప్రతి ప్రభుత్వ భవనానికి కుళాయి నిర్మించాలన్నారు. అన్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు కచ్చితంగా ఉండాలని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎంపీడీవోలు జిల్లాలో మరుగుదొడ్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ 90 రోజులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలన్నారు. హార్టీకల్చర్ ప్లాంటేషన్ వచ్చే నెల మొదటి వారం లోపు పూర్తి చేయాలన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌ను వచ్చేనెల రెండో తేదీ నాటికి కచ్చితంగా పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ నగదును రికవరీ చేయాలన్నారు. సచివాలయాల్లో సర్వీసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ శ్రీనారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, హౌసింగ్ పీడీ పేరయ్య, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

- ఆర్డీవో విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని డీఆర్ఓ విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దీనిలో ఆర్డీవో మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు పరిశీలన పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయని వారు ఆధార్ లేదా నిర్దేశించిన 16 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానితో ఓటుకు అనుసంధానం చేసుకోవాలని అన్నారు. ఫారం–7కు సంబంధించి పదివేల మందికి పైగా నోటీసులు పంపామని తెలిపారు. దీనిలో కొత్తపట్నం తహశీల్దార్ రమణారావు, డీటీ అర్జున్‌రెడ్డి, ఓఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఒంగోలు డీటీ రఫీ, టీపీవో శివప్రసాద్, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్, రమేష్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

గణేశునికి లక్ష్మీశోభ

- రూ.15 లక్షల కొత్త కరెన్సీ నోట్ల అలంకరణలో వినాయకుడు



కరెన్సీ నోట్లతో అలంకరణలో వినాయకుడు

ఒంగోలు మెట్రో: ఒంగోలు గద్దలగుంటపాలెం రాజా పానగల్ రోడ్డులో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వినాయకుడికి రూ.15 లక్షల కొత్త కరెన్సీ నోట్లతో గణనాథుని ప్రత్యేకంగా అలంకరించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరు బుజ్జి, చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి దశరథ రామారావు, రేణుకా దేవి, ఓం శ్రీ హరి నారాయణ భక్త బృంద సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సాహంగా ప్రకాశం క్రికెట్ లీగ్ పోటీలు

మార్కాపురం: ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రకాశం క్రికెట్ లీగ్ పోటీలు మార్కాపురం పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాల గ్రౌండ్‌లో ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. ముందుగా రాయవరం వర్సెస్ వేములకోట జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి వేములకోట జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, రాయవరం జట్టు 10 ఓవర్లకు 126 పరుగులు చేసింది. వేములకోట జట్టు 8 వికెట్లు కోల్పోయి 57 పరుగులు మాత్రమే చేయడంతో రాయవరం జట్టు గెలిచింది. రెండో మ్యాచ్ దరిమడుగు వర్సెస్ తుమ్మలచెరువు జట్ల మధ్య జరగ్గా దరిమడుగు జట్టు 5 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసింది. తుమ్మలచెరువు జట్టు 7 వికెట్లు కోల్పోయి 75 పరుగులు మాత్రమే చేయడంతో 48 పరుగుల తేడాతో దరిమడుగు జట్టు గెలుపొందింది. మూడో మ్యాచ్ యువ–11 వర్సెస్ కోనేటి వీధి జట్ల మధ్య జరిగిన పోటీల్లో యువ–11 జట్టు గెలుపొందింది. చివరి మ్యాచ్‌లో తూర్పు వీధి లెవెన్స్ వర్సెస్ కేతగుడిపి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేతగుడిపి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా, తూర్పువీధి లెవెన్స్ టీమ్ 8.3 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 68 పరుగులుచేసి విజేతగా నిలిచింది. ఈ టీములో బ్యాట్స్‌మెన్ ప్రతాపరెడ్డి 21 పరుగులుచేసి మూడు వికెట్లు తీసి మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ప్రతాపరెడ్డి

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

- మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- నిందితులకు శిక్షలు పడేలా చూడాలి
- గంజాయి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు కృషి చేయాలి
- సెబ్ అధికారులతో ఎస్పీ మలికా గర్గ్ సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్


ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు

ఒంగోలు టౌన్: ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమ రవాణాకు నిరోధించేందుకు సరిహద్దు స్టేషన్ల పరిధిలో నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సెబ్ స్టేషన్లలోని పెండింగ్ కేసులను సమీక్షించిన ఎస్పీ ఆయా కేసుల పురోగతి, ముద్దాయిల అరెస్టులపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగుల్లో ఉన్న కేసులను త్వరితగతిన ఛేదించాలని, కేసుల పరిష్కారం గణనీయంగా పెరగాలని చెప్పారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జీషట్ దాఖలు చేయాలని, కోర్టు విచారణలో ఉన్న కేసుల పురోగతిని నిశితంగా పర్యవేక్షిస్తూ నిందితులకు శిక్షలు పడేలా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిత్యం తనిఖీలు చేస్తూ ఇతర ప్రాంతాల నుంచి మద్యం రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేయాలని, జాతీయ రహదారులు, మారుమూల ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అసలు గంజాయి ఎక్కడ నుంచి ఎక్కడికి చేరుతుందో, వినియోగదారుల చేతికి ఎలా చేరుతుందో పసిగట్టి గంజాయి నెట్‌వర్క్‌ను ఛేదించాలని ఆదేశించారు. గంజాయి రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పించాలన్నారు. నాటుసారా, గంజాయి, ఇతరా రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యం, నిషేధిత పొగాకు ఉత్పత్తుల రవాణా, విక్రయాలను అరికట్టేలా సెబ్, జిల్లా పోలీస్ సిబ్బంది పక్కా ప్రణాళికను రూపొందించుకొని సమన్వయంతో ఎప్పటికప్పుడు ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఆదేశించారు.

సెబ్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసలు

గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెబ్ అధికారులు సీఐ రాగమయి, ఎస్సైలు నగేష్, ఎంవీ గోపాలకృష్ణ, బి.శ్రీనివాసులు, సిబ్బంది శామ్యూల్, శ్రీనివాసులు, మాధవరావు, వెంకటేశ్వర్లుకు ఎస్‌ఈబీ కమిషనర్ పంపించిన ప్రశంస పత్రాలను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి రవాణా చేస్తున్న అక్రమ మద్యాన్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ వంశీధర్, ఒంగోలు సెబ్ సీఐ లత, మార్కాపురం సీఐ రాగమయి, సింగరాయకొండ సెబ్ ఎస్సై దయాకర్, డీటీఎఫ్ ఎస్సైలు శ్రీనివాసులు, గోపాలకృష్ణ, సిబ్బంది హరిబాబు, కోటేశ్వరరావు, బాలాజీ, సాల్మన్ రాజ్, వెంకటేశ్వర్లును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, సెబ్ ఏఈఎస్ సుధీర్‌బాబు, మార్కాపురం ఏఈఎస్ దేవదత్, సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాలకొండ ఆదాయం రూ.11,48,729

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.11,48,729 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.29,880, తలనీలాలు రూ.61,000, ప్రత్యేక దర్శనం రూ.3,73,400, లడ్డుప్రసాదాలు రూ.2,47,300, అన్నదానం రూ.3,48,589, రూంఅద్దెలు రూ.34,960లు విరాళాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

చీమకుర్తి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మూడు నెలల పాటు కంప్యూటర్‌లో ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు సంతనూతలపాడు ఎండ్లూరుడొంక మహిళా ప్రాంగణం మేనేజర్ అంజమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9963005209 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు: పాలిటెక్నిక్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లకు ఉన్న అవరోధాలు అన్ని తొలగిపోయాయని, ప్రభుత్వం జీఓ కూడా విడుదల చేసిన దృష్ట్యా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీలో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ విభాగాలలో సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సీటు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై పాలిసెట్ రాసిన వారు, రాయని వారు కూడా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని, ప్రైవేట్ కాలేజీలతో పోలిస్తే తమ కాలేజీలో ఫీజు స్వల్పంగా ఉంటుందన్నారు. అక్టోబరు 3వ తేదీతో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

ముండ్లమూరు: మండలంలోని నందమూరి నగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన పోక్సో కేసులో నిందితుడు చేవూరి వెంకట్రావును మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు దర్శి సీఐ జె.రామకోటయ్య తెలిపారు. ఈనెల 23న బాలికపై వెంకట్రావు అఘాయిత్యానికి పాల్పడగా 24వ తేదీ కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం దర్శి డీఎస్పీ అశోకవర్థన్ ఆధ్వర్యంలో రెండు టీంలను ఏర్పాటు చేయగా మంగళవారం పెద్ద ఉల్లగల్లు వద్ద నిందితుడిని అదుపులోనికి తీసుకుని కోర్టుకు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు పంపిన దర్శి సీఐ జె.రామకోటయ్య, ఎస్సై యూవీ కృష్ణయ్య, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు.

చిన్నారులకు పోషకాహారం తప్పనిసరి

- ఏపీ చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు పద్మావతి


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

మద్దిపాడు: చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని వారికి చేరే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సూచించారు. మంగళవారం ఆమె మద్దిపాడు ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులు బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. బడికి వెళ్లని బాలికలు, బాలుర వివరాలు సేకరించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగస్వాములు కావాలని చెప్పారు. పనికి వెళ్తున్న చిన్నారుల తల్లిదండ్రులకు ఎంఈఓ, హెచ్‌ఎంలు కౌన్సిలింగ్ ఇచ్చి విద్యా హక్కు చట్టం గురించి వివరించాలని, వారిని మరలా పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల ఆవరణలో టోల్ ఫ్రీనెంబర్, 1098, జిల్లా అధికారుల నంబర్లు, రాష్ట్ర కమిషన్ సభ్యుల ఫోన్ నంబర్లు కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముందుగా ఆమె త్రోవగుంటలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్, ఫీడింగ్ అటెండెన్స్ రిజిస్టర్లు లేకపోవడం, 2022 ఫిబ్రవరి నుంచి టేక్ హోమ్ రేషన్ తీసుకుంటున్న వారి వివరాలు నమోదు చేయకపోవడాన్ని గమనించారు. కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. అనంతరం నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ-1 అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. నాగులుప్పలపాడు పాఠశాలలో పిల్లలు స్వయంగా భోజనం వడ్డించుకోవడాన్ని గమనించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్‌ఎం, ఎంఈఓను ఆదేశించారు. ఆమె వెంట సీడీపీఓ ఇవాంజలిన్, ప్రథమ్ కోఆర్డినేటర్ వెంకట్, డీసీపీ యూ ఓఆర్‌డబ్ల్యు శ్యామ్యూల్ రాజు, సెక్టార్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

సింగరాయకొండ: పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈనెల 27వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ దేవస్థాన చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. ఈనెల 28వ తేదీ పవిత్రాల ప్రతిష్ఠ, 29వ తేదీ పవిత్ర సమర్పణ, 30వ తేదీ పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి

- ఆత్మ పీడీ అన్నపూర్ణ


వరి రైతులకు సూచనలిస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

కొండపి(సింగరాయకొండ): పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఆత్మ పీడీ కె.అన్నపూర్ణ సూచించారు. కొండపి మండలం పెట్లూరులో పంట పొలాలను పరిశీలించారు. గోగినేనివారిపాలెంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ పీడీ మాట్లాడుతూ.. రైతులు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడితే పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. సంఘం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పెట్లూరులో కంది, వరి, మిరప పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. డీఆర్‌సీ వ్యవసాయాధికారులు ఎ.శైలజారాణి, వీవీ శేషమ్మ, ఏఓ విజయకుమార్, వీఏఏ పావని పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన ఆదిలక్ష్మి

అర్ధవీడు(కంభం): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత వాస్మాల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అర్ధవీడు మండలంలోని మాగుటూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ గోపాలరాజు కథనం మేరకు.. తర్లుపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నల్లబోతుల ఆదిలక్ష్మి(32)కి అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామానికి చెందిన బాలశేషుతో 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. కొంత కాలం నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఆదిలక్ష్మి మంగళవారం వాస్మాల్ ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చుట్టుపక్కల వారు గమనించి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందింది. మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆదిలక్ష్మి మృతి పైన తమకు అనుమానాలు ఉన్నాయని మృతురాలి సోదురులు, బంధువులు ఆరోపిస్తూ, ముగ్గురు పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వైద్యశాలలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు, పెద్దమనుషులు కలుగజేసుకుని సర్ది చెప్పడంతో ఇరువర్గాల వారు శాంతించారు. సాయంత్రం 7 గంటల సమయంలో మృతదేహాన్ని వైద్యశాల నుంచి తీసుకెళ్లారు.

రైలు కింద పడబోయిన వృద్ధుడు!

- రక్షించిన రైల్వే కానిస్టేబుల్


వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

కంభం: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ వృద్ధుడిని రైల్వే కానిస్టేబుల్ కాపాడి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఈ సంఘటన మంగళవారం కంభం రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. ముత్యాలపాటి పెద్ద వెంకటయ్య అనే వృద్ధుడు సూసైడ్ నోట్ రాసుకొని కంభం రైల్వే స్టేషన్ సమీపంలో తెల్లవారుజామున మూడు గంటల సమయంలో రైలు కింద పడబోతుండగా రైల్వే కానిస్టేబుల్ బ్రహ్మానందరెడ్డి గమనించారు. వేగంగా స్పందించిన కానిస్టేబుల్ వృద్ధుడి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్వల్ప గాయాలైన వృద్ధుడిని హుటాహుటిన కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తన కోడలు, ఆమె కుటుంబ సభ్యులు వేధిస్తుండటం వల్లే ఆత్మహత్య చేసుకోబోయానని వృద్ధుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కురిచేడు: వ్యక్తి అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.దేవకుమార్ తెలిపారు. వివరాలు.. పుల్లలచెరువు మండలం మర్రివేముల గ్రామానికి చెందిన పమిడి భావన్నారాయణ దర్శి మండలం చలివేంద్రం గ్రామంలో బ్రాంచ్ పోస్టుమాస్టరుగా పనిచేస్తున్నారు. ఆయన భార్య స్వగ్రామం కురిచేడు మండలంలోని పడమర వీరాయపాలెం. ఇటీవల హైబీపీ కారణంగా భావన్నారాయణ ఎక్కడంటే అక్కడే పడిపోతున్నాడు. చలివేంద్రం గ్రామస్తులు ఫోన్ చేస్తే వెళ్లి తన భర్తను తీసుకొస్తుంటామని భావన్నారాయణ భార్య మల్లేశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన యర్రగొండపాలెం వెళ్లివస్తానని చెప్పి ఇంత వరకు తిరిగిరాకపోవటంతో బంధువులు తెలిసిన చోటల్లా విచారించారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు


రోడ్డుపై పడి ఉన్న గాయపడిన యువకులు

మార్కాపురం రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చింతగుంట్ల గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కంభం పట్టణానికి చెందిన హుస్సేన్ జానీ, రాజేష్‌లు కంభం నుంచి మార్కాపురం పట్టణానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన యువకులను 108 వాహనం ద్వారా మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర యక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.